ప్రజాశక్తి

బుధవారం 31 జులై 2024

5

అల్లూరి సీతారామరాజు

1న శత శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

-లబ్ధిదారులకు ముందస్తు సమాచారం అందించాలి

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని పింఛనుదారులందరికీ ఆగస్టు 1వ తేదీనే పింఛన్లు పంపిణీ పూర్తి చేయాలని ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ ఈ మేరకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 1,2 తేదీల్లో మొత్తం పింఛన్లు పంపిణీ కావాలని, ఈ విషయాన్ని ప్రతి గ్రామంలో ముందస్తుగా ప్రచారం చేపట్టాలని తెలిపారు. పింఛను డబ్బులను ఈ నెల 31న డ్రా చేసి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 1వ తేదీ ఉదయం 5.గంటల నుంచి పింఛన్లు పంపిణీ కావాలని కలెక్టర్ సూచించారు.

తగ్గిన వరద.. తొలగని భయం...

- మళ్లీ పెరిగే అవకాశం ఉందని అధికారుల హెచ్చరిక
- ఆందోళనల్లో ముంపు బాధితులు
- జాతీయ రహదారిపై సాగుతున్న రాకపోకలు

ప్రజాశక్తి-ఎటపాక

కొద్ది రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి, శబరి నదుల్లో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతుంది. ముంపు గ్రామ ప్రజలను భయాందోళన గురి చేసిన గోదావరి వరద సోమవారం అర్ధరాత్రికి భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు దిగువకు చేరింది. అయితే కొద్ది గంటల్లోనే మళ్లీ పెరిగి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి 43.5 అడుగులకు చేరింది. మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42.9 అడుగులకు చేరింది. ఎగువ నుండి వరద వస్తున్న నేపథ్యంలో వరద ముంపు ముప్పు ఇంకా తగ్గలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు మూడు అడుగుల వరద పెరిగి తగ్గవచ్చని సిడబ్ల్యూసి అధికారులు వెల్లడించారు.

చింతూరు : జాతీయ రహదారి 30 వద్ద వరద నీరు పూర్తిగా తగ్గిపోవడంతో భద్రాచలం, రాజమండ్రితో పాటు ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. సోకులేరు వాగులు రహదారులపై నుండి ఇంకా నీరు తగ్గకపోవడంతో ఆ గ్రామాలకు మండల కేంద్రానికి రవాణా సౌకర్యం లేదు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 42.9 అడుగుల ఉండగా దిగువకు 9,14,162 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 38 అడుగులకు చేరింది. శబరి ఒడ్డు చింతూరు మార్కెట్‌కు రహదారి వరద ముంపు నుండి బయటపడింది. అయితే భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యూసి అధికారులు హెచ్చరికలు చేశారు. ఆగస్టు 15 వరకు ఇదే విధంగా వరదలు పెరుగుతూ తగ్గుతూ ఉంటాయని తెలిపారు. దీంతో ఇప్పట్లో పునరావాస కేంద్రాలు నుండి ప్రజలు తమ గ్రామాలకు వెళ్లే అవకాశం కనపడటం లేదు.

విఆర్.పురం : శబరి గోదావరి నదులు శాంతించడంతో వరద బాధితులు మంగళవారం గుడారాలు వదిలి, తమ స్వగ్రామాల్లో ఇళ్లను శుభ్రం చేసుకోవడానికి పడవలపై వెళ్లారు. అక్కడ వెళ్లి గృహాలు చూడగా కొన్ని పగుళ్లు వచ్చాయని, కొన్ని ఒరిగి పోయాయని, కొన్ని పూర్తిగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వరదలకు వడ్డుగూడెం కాలనీ నుండి వడ్డుగూడెం వరకు రహదారి, ధర్మతాల గూడెం, నుండి కూనవరం వెళ్లే ఆర్ఎంబి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయాయి. కన్నాయి గూడెం, నుండి రామవరం వరకు రోడ్డుపై మట్టి పేరకుపోయింది. తక్షణమే అధికారులు ఆ మట్టిని తొలగించాలని, పాడైపోయిన రోడ్లను మరమ్మతులు చేయించాలని, పడిపోయిన గహాలకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

ఒడ్డిగూడెం కాలనీలో నిలిచి ఉన్న వరద నీరు

కూనవరం మండలం పోలిపాక వద్ద వరద తాకిడికి ధ్వంసమైన రోడ్డు

వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరం

ఎటపాక : వరద ప్రభావిత గ్రామాలైన నందిగామ, మురుమూరు, నందిగామపాడు గ్రామాల్లో గత వారం రోజులుగా ఉంటూ రోగులకు మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది మంగళవారం వైద్య బృందంతో వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది సేవలను ప్రజలు అభినందించారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ రాజేష్, హెచ్‌వి సత్యవాణి, ఏఎన్ఎంలు భవాని, చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్ పి రామకృష్ణ, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ తక్షణమే చేపట్టాలి

- కలెక్టర్‌కు సిపిఎం ప్రజాప్రతినిధులు, నేతల వినతి

కూనవరం : కూనవరం మండలంలో వరదల వల్ల పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, తక్షణమే పునరుద్ధరించాలని సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలో పర్యటించిన కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సిపిఎం సర్పంచులు, ఎంపిటీసీలు, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ పోలవరం బ్యాక్ వాటర్ వల్ల గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు నీట మునిగాయని, దీంతో పంద్రాజుపల్లి నుండి పెద్ద ఆర్కూర్, కూటూరు, రేగులపాడు, లింగాపురంతో పాటు సుమారు 20 గ్రామాలకు పది రోజుల నుండి విద్యుత్ సరఫరా ఆగిపోయిందని తెలిపారు. దీంతో ఆయా గ్రామాల అంధకారంలో ఉన్నాయని, మోటార్లు పని చేయక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విద్యుత్ పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఆర్కూర్ సర్పంచ్ నాగమణి, కూటూర్ సర్పంచ్ వెంకమ్మ, లింగాపురం సర్పంచ్ శంకర్, పెద్ద ఆర్కూర్ ఎంపీటీసీ బి అమ్మాజీ, మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు

41.15 కాంటూరులో చేర్చి ప్యాకేజీ ఇవ్వండి

ప్రతి ఏటా గోదారి వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. భద్రాచలం వద్ద 43 అడుగులు వరద వస్తేనే మా గ్రామం చుట్టూ వరద చేరి ద్వీపంలా తయారవుతుంది. భద్రాచలం, కూనవరం నుండి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ నెల 21 నుండి నేటి వరకు 8 రోజులపాటు బాహ్య ప్రపంచానికి రాకపోకలు లేక నిత్యావసరాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పోలవరం కాఫర్ డ్యామ్ కారణంగానే ఇంత ఇబ్బందులు పడిలేదు. మా గ్రామాన్ని 41.15 కాంటూరు ముంపు జాబితాలో చేర్చి పోలవరం పునరావాస ప్యాకేజ్ ఇవ్వాలి.

- అమరవరపు నాగేంద్ర, మురుమూరు, ఎటపాక మండలం

కుంగిపోయిన ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలి

13 రోజుల నుండి గ్రామంలో వరద నీరు నిల్వ ఉండడంతో మా గృహాలు కుంగిపోయాయి. ప్రతి సంవత్సరం వరదలకు నష్ట పోతున్నాం. సర్వే చేసిందని మాకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఇక్కడి నుంచి పంపించాలని కోరుతున్నాం. కాని ప్రభుత్వాలు పట్టించుకోలేదు. మా ఇల్లు కుంగిపోయింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి.

- ముత్యాల శ్రీనివాసరావు, వడ్డుగూడెం కాలనీ, విఆర్.పురం మండలం

ప్రభుత్వమే ఇళ్లు కట్టి ఇవ్వాలి

వరద తగ్గడంతో గృహాలను శుభ్రం చేసుకోవడానికి వచ్చాం. గహాలు కొన్ని పడిపోయి కొన్ని కుంగిపోయాయి. పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేస్తున్న మాకు ప్రభుత్వం అన్యాయం చేస్తుంది. తక్షణమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పంపించాలి. ప్రభుత్వమే గృహాలు కట్టించి ఇవ్వాలి.

- ఎం.దుర్గాప్రసాద్, పాత రాజుపేట, విఆర్.పురం మండలం

పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎమ్మెల్యే

బాధితులకు సహాయం అందిస్తాం

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-కూనవరం

వరద బాధితులందరికీ ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, బాధితులెవ్వరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కూనవరం మండలం కూనవరం గ్రామంలో గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవితో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3వేలు నగదును, 25 కేజీల ఉచిత బియ్యాన్ని పంపిణీ చేశారు. తమను ముంపు గ్రామం కింద పరిగణించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించాలని వరద బాధితులు ఈ సందర్భంగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ నిబంధనలను అనుసరించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. రేషన్ కార్డుతో సంబంధం లేకుండా బాధితులందరినీ ఆదుకుంటామన్నారు.

రంపచోడవరం శాసనసభ్యులు మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ముంపు బాధితులు ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి అన్ని విధాల సిద్ధంగా ఉందని, అర్హత గల వారందరినీ గుర్తించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద గృహ నిర్మాణాలు పూర్తి చేసి త్వరగా పంపించే ఏర్పాట్లు ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముంపు మండలాల నోడల్ అధికారులు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, చింతూరు ఏఎస్‌పి రాహుల్ మీనా, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, పలువురు జిల్లా, డివిజనల్ అధికారులు, మండల తహసీల్దార్, ఎంపిడిఓ పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని శబరి ఒడ్డును జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే శిరీష దేవి, తెలుగు యువత అధ్యక్షులు విజయ భాస్కర్ మంగళవారం సందర్శించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేలు నగదు, బియ్యం ప్రజలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. విఆర్.పురం మండలం సంతపాకల వద్ద బాధితులు ఏర్పాటు చేసుకున్న గుడాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా, డివిజన్ అధికారులతో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

పొంగిన ఎర్రంపాడు వాగు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సోమవారం రాత్రి, మంగళవారం కురిసిన భారీ వర్షానికి రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు వద్ద వాగు పొంగి ప్రవహిస్తుంది. ప్రతినిత్యం వందలాదిమంది రాకపోకలు సాగించే ఈ వాగు పొంగి ప్రవహించడంతో విద్యార్థులను పాఠశాలకు తప్పనిసరిగా తీసుకెళ్లాల్సిన నేపథ్యంలో వారి తల్లిదండ్రులు సాహసం చేసి భుజంపైకి ఎత్తుకొని వాగు దాటించారు. ఇదే పరిస్థితి పదేపదే పునరావృతం అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. ఈ వాగుకు అవతల ఉన్న శ్రీరామ్‌నగర్, శాంతినగర్, బూరుగుపల్లి, వయ్యాడ గ్రామాల ప్రజలు దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

కుమారుడిని ఎత్తుకొని వాగు దాటిస్తున్న తండ్రి

విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డిఇఒ

పాఠశాలలను తనిఖీ చేసిన డిఇఒ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో పలు పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు ఆకస్మికంగా తనిఖీ చేపట్టారని ఎంఈఓ కృష్ణమూర్తి సోమవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కిలగడలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలు తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుల పనితీరును పరిశీలించి అసంతృప్తి వ్యక్తపరిచారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా అందించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పనితీరు మార్చుకోవాలని సూచించారు. విద్యాభ్యాసంలో వెనుకబడిన వారిని సైతం క్రమశిక్షణలో పెట్టి ముందంజలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థులకు ప్రశ్నలు వేయగా సమాధానం చెప్పలేకపోవడంతో అసంతృప్తితో వెనుతిరిగారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

రైతులను ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు, మండల నాయకుడు టి సూర్యనారాయణ, పి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన సొవ్వా పంచాయితీ కంగారు సోల గ్రామాల్లో తుఫాన్ తో దెబ్బతిన్న పంటలను మంగళవారం వారు పరిశీలించారు. కంగారుసోల గ్రామానికి చెందిన కొర్ర తైడు, కొర్ర సుబ్బు, సితన్న బాలరాజు, ప్రకాష్, సీతారాం బాధితులకు చెందిన సుమారు 10ఎ కారరాల భూములు పంటలు తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిందన్నారు. వరి నాట్లు వరదలకు కొట్టుకొని పోవడంతో పాటు మరికొన్ని కొన్ని వరి పంటల్లో ఇసుక మట్టి మెట్ట వేసిందన్నారు. గ్రామాల్లో కనీసం అధికారి యంత్రాంగం పర్యటన కూడా నిర్వహించలేదని అన్నారు. వెంటనే ప్రభుత్వ యంత్రాంగం గ్రామాల్లో పర్యటించి తుఫాను బాధితులకు ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత గిరి రైతులు పాల్గొన్నారు.

వర్షపు నీటిలోనే రేషన్ దుకాణం

-చెరువును తలపిస్తున్నా పట్టించుకోని అధికారులు

- ఆగస్టు నెలకు గోదాము నుంచి చేరని సరుకులు

ప్రజాశక్తి-చింతపల్లి: అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంట పొలాలు, మురుగు కాలువలే కాకుండా నివాస గృహాలు, ప్రభుత్వ కార్యాలయాలు సైతం వర్షపు నీటిలో చిక్కాయి. రెండు రోజులుగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించినట్లయింది. మండలంలోని పెదబరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్ గ్రామంలో గిరిజన సహకార సంస్థకు చెందిన రేషన్ డి ఆర్ డిపో వద్ద వర్షపు నీరు నిల్వ ఉండి చెరువును తలపిస్తున్నా, నేటికీ అధికారులు చర్యలు చేపట్ట లేదు. ఆ పరిసరాలలో ఉన్న ఇళ్లన్నీ నేటికీ నీటితో నిండిపోయే ఉన్నాయి. వర్షపు నీరు నిల్వ ఉండి పోవడంతో, తమ ఇంటి గుమ్మం వరకూ నీరు చేరి, అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొందని పరిసర గృహాలలో ఉంటున్న కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారి 516ఈ నిర్మాణంలో భాగంగా గ్రామానికి మధ్యలో ఎక్కువ ఎత్తులో రహదారిని నిర్మించి వాటికి ఎత్తయిన మురుగు కాలువలు ఏర్పాటు చేశారని, ఆ కాలువలకు కల్వర్టు లేక పోవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు, మురుగు నీరు కాలువల లోకి వెళ్లక పోవడంతో ఈ పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామం పొడవునా మురుగు కాలువలు ఉన్నా, అవి ఎత్తులో ఉండడంతో కొండ ప్రాంతానికి దిగువన ఉన్న ప్రాంతంలో కొండ నుంచి వచ్చే ఊటనీరు మురుగు కాలువలలోకి వెళ్లలేక ఒక దగ్గరే స్తంభించి పోయిందని, ముఖ్యంగా రేషన్ దుకాణం వద్ద ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. రేషన్ దుకాణం వద్ద నీరు చేరడంతో గోదాము నుంచి నిత్యావసర సరుకులు రేషన్ దుకాణానికి చేరవేసే పరిస్థితి లేకుండా పోయిందని జిసిసి సేల్స్‌మేన్ పి.నెహ్రూ బాబు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టులో ఇవ్వాల్సిన రేషన్ సరుకులు ఈ పాటికే గోదాము నుంచి తమ దుకాణానికి రావాల్సి ఉందని, దుకాణం చుట్టూ నీరు చేరడంతో సరుకులను దుకాణానికి తరలించడం వీలు కాలేదన్నారు. మోటార్ల సహాయంతో నీరుని తోడించే ప్రయత్నం చేసినప్పటికీ, కొండ నుంచి వస్తున్న ఊట నీరు కారణంగా మరలా అదే పరిస్థితి పునరావృతం అవుతుందన్నారు. సోమవారం తన సొంత నిధులతో జాతీయ రహదారికి నిర్మించిన డ్రైనేజీ గోడను డ్రిల్లింగ్ మిషన్ సహాయంతో రంధ్రం చేయించానని, అయినప్పటికీ పూర్తిస్థాయిలో నీరు వెళ్ల లేదన్నారు. రేషన్ దుకాణానికి ఆనుకుని పెద్ద పెద్ద వృక్షాలు ఉన్నాయని, నీరు నిలువ ఉండడంతో నేల పూర్తిగా తడిసి వృక్షాలు కూలి పోయేలా ఉన్నాయని, జిసిసి ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆవేదన వ్యక్తం చేస్తున్న జిసిసి సేల్స్‌మ్యాన్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పిఒ అభిషేక్

విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకోవాలి : పిఒ

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా ప్రయత్నం చేయాలని ఐటిడిఎ పీఓ వి.అభిషేక్ సూచించారు. గుత్తులపుట్టు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, దిగుమోదా పుట్టు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సూపర్ 50 పేరిట పదవ తరగతి విద్యార్థులకు అందిస్తున్న బోధనా విధానాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదిలో ఉత్తమ మార్కులు సాధించాలని సూచించారు. పదిలో మంచి మార్కులు సాధించి కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్సులో ప్రవేశం పొందాలన్నారు. ఇంటర్ తరువాత ఐ.ఐ.టి, త్రిబుల్ ఐ.టి, ఎన్.ఐ.టి. నీట్, ఎంసెట్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత ఎపిపిఎస్సి, గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు, యూపిఎస్సీ నిర్వహిస్తున్న సివిల్స్ పరీక్షలపై అవగాహన కల్పించారు. గిరిజన విద్యార్థులు ఐ ఎ ఎస్, ఐపి ఎస్, ఐ ఎఫ్ ఎస్, ఐ ఆర్ ఎస్ వంటి ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. ఆదివారం ఆశ్రమ పాఠశాలలో సందేశాత్మకమైన చలన చిత్రాలు ప్రదర్శించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని పాల్గొన్నారు.

వర్షాలకు రహదారులు అస్తవ్యస్తం

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కురిసిన వర్షాలకు రోడ్లంతా కోతకు గురై బురదమయంగా మారాయి. అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం నుండి రాజుపాక, డెక్కపురం, పడ్కదౌడ, పెదురు నుండి మాలింగవలస పాతకోట మీదుగా రేగం వయా తేనెపుట్టు, తెల్లారపాడు, నందిగుమి, మద్దిగరువు, వాలసి జెండా గరువు నుండి ఊటగెడ్డ లుంగపర్తి పంచాయతీ మెటవలస నుండి నేలపాలేం, మలుంగుమ్మి గ్రామాల రోడ్లు పూర్తిగా కోతకు గురై వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి రోడ్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల గిరిజన ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురైన రోడ్డు

బురదమయంగా మారిన రహదారి

ర్యాలీ చేపడుతున్న సిబ్బంది

అరకులో పారిశుధ్య పక్షోత్సవాలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పారిశుధ్య పక్షోత్సవాలలో భాగంగా మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలో మంగళవారం స్థానిక సర్పంచ్ జి.శారద ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పారిశుధ్యంపై ప్రజలకు తగు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి వ్యాధుల భారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షేక్ వలీభాయ్, కిలో జీవన్, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పి సిఇఒ పోలినాయుడుకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఎంపిపి పద్మ

జి.మాడుగుల ఎంపిపి పద్మ రాజీనామా

ప్రజాశక్తి-జి.మాడుగుల: జి.మాడుగుల మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు, టీడిపి పార్టీకి చెందిన కొర్ర పద్మ తన ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. మంగళవారం విశాఖపట్నంలో జడ్పీ సీఈవో పోలినాయుడుకు తన కార్యాలయంలో ఆమె రాజీనామా పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రం సరిహద్దు ప్రాంతం కావడంతో ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేశారు. మావోయిస్టుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో ఆదివాసి గిరిజనులు వ్యవసాయ రీత్యా అడవులకు వెళ్ళినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో సిఆర్పిఎఫ్, ఏపీఎస్పి స్పెషల్ ఫోర్స్ బృందాలు పాల్గొన్నాయి.

జి ప్యాట్ పరీక్షపై అవగాహన

శాస్త్రవేత నాయుడు తేజను సత్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ద్వారా బి ఫార్మశీ అభ్యసిస్తున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జిప్యాట్ తదితర పోటీ పరీక్షలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడుకు చెందిన జెఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి శాస్త్రవేత్త నాయుడు తేజ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిప్యాట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన వారికి దేశంలోని ప్రముఖ విద్యాలయాలలో ఎం.ఫార్మశీ ప్రవేశంతో పాటు నెలకు రూ.12,400 స్టైఫడ్ లభిస్తుందని తెలిపారు. జిప్యాట్ విద్యార్థులు ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫార్మాకాలజీ, ఫార్మకోగ్నశీలలో ప్రవేశం పొందవచ్చని వివరించారు. జిప్యాట్ ఉత్తీర్ణత సాధించడం విద్యార్థుల కెరీర్‌కు ఉపయోగపడుతుందని, ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రధాన అర్హతగా పరిగణిస్తారని తెలిపారు. జిప్యాట్ పరీక్షకు ఎలా సిద్ధం అవ్వాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్ అధ్యక్షత వహించగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం

ఐటిడిఎ పిఒ అభిషేక్

వ్యవసాయ పరికరాలు ఇస్తున్న పిఒ

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని ఐటిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. స్థానిక సెరీకల్చర్ కేంద్రంలో ఉన్న ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం సంస్థ ఏరువాక కేంద్రంలో ముంచంగిపుట్టు, అరకు వ్యాలీ, పాడేరు, జి.మాడుగుల, డుంబ్రిగుడ మండలాల అభ్యుదయ రైతులకు చిరుధాన్యాలు, నూనెగింజల సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త ఎ.అప్పల స్వామి అధ్యక్షతన మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. రైతులు నూనె గింజలు, చిరుధాన్యాలను మార్కెట్లో డిమాండ్ ఆధారంగా సాగు చేయాలన్నారు. శాస్త్ర వేత్తలు చెప్పిన సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. రానున్న రోజుల్లో రైతులకు ఆధునిక వ్యవసాయ ఉపకరణాలు, శీతల గిడ్డంగులను అందుబాటులోకి తెచ్చి రైతాంగానికి అందిస్తామన్నారు.

వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్ర వేత్త ఎ.అప్పల రాజు మాట్లాడుతూ, పర్వత శ్రేణి మండలానికి అనువైన కొత్త రకం రాజ్మా వంగడాలు, వలిసెలు, రాగులు, కొర్రలు, సామలను చింతపల్లి పరిశోధనా స్థానం నుండి పరిచయం చేస్తున్నామన్నారు.

జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్‌రావు మాట్లాడుతూ, కాఫీ, పసుపు, అల్లం వంటి పంటలకు సేంద్రీయ ఎరువులు వినియోగించాలని సూచించారు. తెగుళ్ల నివారణకు వేప పిండిని ఉపయోగించాలని చెప్పారు.

జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు మాట్లాడుతూ, పట్టు పురుగుల సాగుతో రైతులకు 28 రోజుల్లోనే ఆదాయం వస్తుందన్నారు. రానున్న రోజుల్లో 800 నుండి 1000 ఎకరాల్లో పట్టు సాగు విస్తరణకు, మల్బరీ సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు.

ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ కె.తేజేశ్వరరావు మాట్లాడుతూ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ద్వారా వలిసెలు, సజ్జలు, రాగులు వంటి నూతన వంగడాలను రైతులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. అనంతరం రైతులకు వ్యసాయ ఉపకరాణాలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎపిజివిబి భవనం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ శిథిలావస్తకు చేరింది.మండల కేంద్రంలో రెవెన్యూ క్వార్టర్స్ లో దాదాపు పది సంవత్సరాలు పైబడి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆ భవనంలోనే నేటి వరకు లావాదేవీలను నడుపుతున్నారు. ఈ బ్యాంకు శాఖకు పూర్తిస్థాయి భవనం లేదు.శిథిలావస్థకు చేరిన భవనం ఏ సమయంలో కూలి పోతుందోనని ఖాతాదారులు వాపోతున్నారు.బ్యాంకులో లావాదేవిలకు వినియోగిస్తున్న కంప్యూటర్ వంటి పరికరాలు బీటలు వాలిన గోడల వైపు నుండి నీరు చేరి తడిసి పోతున్నాయి. శ్లాబ్ పూర్తి స్థాయిలో కారిపోవడంతో పరికరాలు పాడైపోకుండా పర్జాలను కప్పి భద్ర పరిచినట్లు సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుకు నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని ఖాతాదారులు మన్మధరావు, శంకర్రావు, గోవిందు, దాసు బాబు కోరారు.

శిథిలావస్థలో ఉన్న బ్యాంకు భవనం

చిన్నపాకలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పాఠశాల వద్ద విద్యార్థులు, నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండలంలోని పెద గూడ పంచాయతీ బాంకుబెడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిన్న పాకలో కొనసాగుతోంది. ఈ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు ఈ ఏడాది విద్యనభ్యసిస్తున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నేత కూడా దాసు ఆ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కూలి పోవడంతో చిన్నపాకలో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. అకాల వర్షాలకు పాకలో నీరు చేరి బురద మయంగా మారి అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. పాఠశాల పాక నిర్మాణం కొరకు విద్యార్థుల తల్లిదండ్రులు చందాలు వేసుకొని పాకను నిర్మించుకున్నారన్నారు. శిథిలావస్థకు చేరి పాఠశాల భవనం కూలి సుమారు పదేళ్లు గడుస్తున్నా నేటికీ భవన నిర్మాణాలను నిర్మించలేదన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల భవనాల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బి టెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు ప్రయివేట్ రెస్టారెంట్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బి టెక్ విద్యార్థి మతి చెందాడు. అతని స్నేహితునికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్ఐ పైడిరాజు కథనం ప్రకారం... విజయనగరం ఎంవిజిఆర్ కళాశాలలో బి టెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విజయనగరం జిల్లా, నెలిమర్ల మండలానికి చెందిన వల్లి సాయి గణేష్ కుమార్ (20), అతని స్నేహితుడు అదే జిల్లా, డెంకాడ మండలం, దొడ్డి గడువ గ్రామానికి చెందిన బి టెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి తెలుగు తేజస్ విజయనగరం ఎంవిజిఆర్ కళాశాల నుంచి మోటారు సైకిల్‌పై భీమిలి వచ్చారు. ప్రయివేటు హోటల్ వద్ద మోటారు సైకిల్‌ను సాయి గణేష్ కుమార్ మలుపు తిప్పే క్రమంలో డివైడర్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన సాయి గణేష్ కుమార్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని స్నేహితుడు తెలుగు తేజస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయులో పలు విభాగాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్

వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఎయును తీర్చిదిద్దాలి

ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్

ప్రజాశక్తి-విశాఖపట్నం : వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా ఎయును తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉన్నత విద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ అన్నారు. మంగళవారం ఏయూను సందర్శించిన ఆయన పాలక మండలి సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఎయు ఇంచార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సమక్షంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సౌరభ్ గౌర్ మాట్లాడుతూ, నైపుణ్యాలను విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. వర్సిటీలోని ప్రతి విభాగంలోనూ ఇండస్ట్రీ ల్యాబ్స్‌ను స్థాపించాలన్నారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న విభిన్న శాఖలు సమన్వయంతో కలసి పనిచేయాలని తెలిపారు. ప్రవేశాల విధానం, ప్రక్రియ, వార్షిక కాలెండర్, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పన, విభాగాలు, ప్రాజెక్టులు, సిఇఒల పనితీరును పరిశీలించడానికి వచ్చానన్నారు.

విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా వీటిలో భాగస్వాములైతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి ఉపాధ్యక్షులు ఆచార్య పి.ఉమామహేశ్వరి దేవి, ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్స్ జి.గిరిజాశంకర్, ఎంవిఆర్.రాజు, కె.సీతామాణిక్యం, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు

మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో గ్రామాలలో గృహాలు నేల మైన బాధితులను ఆదుకోవాలని సర్పంచ్ మండి బాబూరావు కోరారు. మండలంలోని పెదగూడ గ్రామానికి చెందిన గొల్లూరి లొచ్మ, కిల్లో మహదేవ్ గృహాలు ఇటీవల కురిసిన వర్షాలకు కూలి నేల మట్టమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన పరిశీలించి మాట్లాడుతూ, బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వర్షాకాలకు సీజన్లో వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. గృహ, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

మెయిన్ డ్రెయినేజీకి లింక్ చేయాలి

ప్రజాశక్తి - కొయ్యూరు : కొయ్యూరు మండలం కినపర్తి పంచాయతీ వలనంపేటలో లింక్ డ్రైనేజీలు నిర్మించి, వాటిని మెయిన్ డ్రైనేజీకి లింకు ఇవ్వకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోయి ఇంటి పునాదుల్లోకి చొచ్చుకుని పోతుందని, వెంటనే మెయిన్ డ్రైనేజీకి లింక్ ఇవ్వాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇల్లు కోల్పోయిన వారు మళ్లీ ఇళ్ల నిర్మించుకోగా, అక్కడ నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ ప్రమాదకరంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలు పడినప్పుడు నీరు నిల్వ ఉండి, ఇండ్ల చుట్టుపక్కల ఉన్న మట్టి కొట్టుకుపోయి పునాదుల్లోకి నీరు చేరిపోతుందని, దీని వల్ల ఇల్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

కౌలు రైతు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి -కొయ్యూరు : కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం సంబంధిత కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.ఉమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అర్హత కలిగిన కౌలు రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్ద తమ వివరాలను దరఖాస్తు రూపంలో అందించాలని సూచించారు. ప్రతి ఆర్బీకే పరిధిలో వారి అర్హతను బట్టి ఐదుగురు కౌలు రైతులను ఎంపిక చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. కౌలుకు చేసే రైతులు అరెకరం నుంచి ఎంతైనా భూమి సాగు చేసుకోవచ్చని, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. కౌలు రైతు కార్డు పరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. కౌలు రైతు కార్డు వల్ల పంటల బీమా పొందవచ్చని, ప్రకతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే పరిహారం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు చేయవచ్చని తెలిపారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరంలో ప్రస్తుతం ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని దానిని అభివృద్ధి చేయాలని జనసేన పార్టీకి చెందిన పంచాయతీ వార్డు మెంబర్ బొమ్మిశెట్టి రమణి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ శ్మశాన వాటికకు గోడ లేదని, అంత్యక్రియలు అనంతరం స్నానం చెయ్యడానికి సదుపాయాలు లేవని, చితికి మంటల పెట్టినప్పుడు వర్షం వస్తే అక్కడ ఉన్న వారి పాట్లు వర్ణనాతీతమని పేర్కొన్నారు. ఇదే విషయమై గ్రామపంచాయతీ సభలో పలుమార్లు ప్రస్తావించడం జరిగిందని, కాని ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పూనుకొని ఈ శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని కోరారు.

పూర్తిస్థాయి డిడిఓలను నియమించాలి

ప్రజాశక్తి - సీలేరు : గ్రామ పంచాయతీలకు పూర్తిస్థాయి డిడిఓలను నియమించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర బాలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి ఒక డిడిఓ ఉండాలన్నారు. పది సంవత్సరాలు కాలం నుండి ఒకే డిడిఓను సుమారు నాలుగు ఐదు పంచాయతీలకు ఇన్చార్జి ఇవ్వడంతో మారుమూల పంచాయతీలకు వచ్చిన నిధులు ఆయా పంచాయతీ పాలకవర్గ సభ్యులతో చర్చించి అభివృద్ధి చేయడంలో విఫలమవుతున్నారని పేర్కొన్నారు.

నాలుగు నెలలకు ఒకసారి జరిగే గ్రామసభల్లో డిడివోలు పంచాయతీలకు వచ్చి నిధులతో ఏ అభివృద్ధి పనులు చేశారు, ఇంకా అభివద్ధికి ఏం చేయాలో చర్చించవలసి ఉందని, అటువంటిది ఏమి జరగపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. పంచాయితీలకి డీడీవోలు లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రతి పంచాయతీకి గ్రేడ్ 5 సెక్రటరీలకు చెక్ పవర్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు తాగిన చిరంజీవి, మురళి చంటిబాబు, బాబురావు, సింహాచలం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సూచించారు. రాజవొమ్మంగి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన జరిగిన మంగళవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ దేవమణి, పంచాయతీ కార్యదర్శి ఏ మల్లేశ్వరరావు, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి పెద్దిరాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణలత, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి

కప్పలబంద గ్రామానికి వంతెన నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ డిమాండ్

ప్రజాశక్తి- వై.రామవరం

ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. వై.రామవరం మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు వారాలు తరబడి కూలి డబ్బులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పుల వలన కూలీలు ఉపాధి పనులకు దూరమౌతున్నారని పేర్కొన్నారు. మస్టర్ విధానాల్లో లోపాలున్నాయన్నారు. రోజు రోజుకి నిత్యావసర ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, పనిముట్ల అలవెన్స్ చెల్లించాలని, పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి బకాయి వేతనాలు తక్షణమే చెల్లించకపోతే ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కప్పలబంద గ్రామస్తులు భారీ వర్షాలు కారణంగా ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగును ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దాటి మండల కేంద్రానికి, ఆసుపత్రికి, నిత్యావసరాలు తెచ్చుకోవడానికి వెళ్లవలసి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కప్పలబంధ గ్రామానికి వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల కార్యదర్శి కె.శాంతిరాజు, నాయకులు జి.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిరణ్

సీలేరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని జీకే వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ మంగళపాలెం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద రెండు నెలలుగా పనులు నిర్వహించిన ఇప్పటివరకు తమకు డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని, ఇలా అయితే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ప్రశ్నించారు. అనేకసార్లు పత్రికా ముఖంగా కూలి డబ్బులు చెల్లించాలని ప్రభుత్వానికి తెలియజేసినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో చిన్నారావు, టెక్నికల్ అసిస్టెంట్ మూర్తి డబ్బులు తమ ఖాతాలో పడేవిధంగా కృషి చేయడం లేదని, వారు నిర్లక్ష్యం కారణంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి తమ కూలి డబ్బులు వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

తీవ్ర అనారోగ్యంతో విద్యార్థి మృతి

రహదారి సౌకర్యం లేక సకాలంలో ఆసుపత్రికి తరలించలేని పరిస్థితి

ప్రజాశక్తి - సీలేరు : కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న విద్యార్థి సోమవారం రాత్రి మృతి చెందిన సంఘటన జికె.వీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి ఎం.బుషికొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎం.బుషికొండ గ్రామానికి చెందిన జర్త శంకర్రావు, కాసులమ్మ దంపతుల కుమారుడు జర్త శామ్యూల్ (13) చప్పర్ల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో కడుపు నొప్పితో అనారోగ్యానికి గురి కావడంతో తల్లిదండ్రులు వచ్చి నాలుగు రోజుల క్రితం తమ స్వగ్రామానికి తీసుకెళ్లిపోయారు. సోమవారం రాత్రి శ్యామ్యూల్‌కు కడుపునొప్పి, వాంతులు విరోచనాలు అధికమయ్యాయి. ఒకపక్క బోరున వర్షం, మరోపక్క రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్య సేవలు పొందే అవకాశం లేకపోయింది. శామ్యూల్ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందాడు. తమ గ్రామం నుంచి ఆసుపత్రికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో వల్లే తమ కుమారుడికి వైద్య సేవలు అందక మృత్యువాత పడ్డాడని గుండెలు బాదుకుంటూ బోరున విలపించారు. తమ కుమారుడు అనారోగ్యంతో ఉంటే సకాలంలో వైద్య సేవలు అందించకుండా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇంటికి పంపించిందని ఆరోపించారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేశారు.

మృతుడు శామ్యూల్

ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదు

విద్యార్థి శ్యామూల్ మృతిపై సప్పర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుల పి.నాగేశ్వరరావు, వార్డెన్ బి.భాస్కరరావును ప్రజాశక్తి వివరణ కోరగా... శామ్యూల్ అనారోగ్యం పట్ల ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదని తెలిపారు. తాము వైద్య సేవలు అందించిన అనంతరం నాలుగు రోజుల క్రితమే శామ్యూల్ తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి అతడిని ఇంటికి తీసుకుపోయారని పేర్కొన్నారు. సోమవారం రాత్రి శామ్యూల్ వాంతులు విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థి అంత్యక్రియల నిమిత్తం ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశామని చెప్పారు.

రహదారి లేక విద్యార్థి మృత్యువాత

బుషికొండ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో శ్యాములుని ఆసుపత్రికి తీసుకెళ్లలేకపోవడంతోనే అతడు మృతి చెందాడు. ఐదు సంవత్సరాల క్రితం గ్రామస్తులు తాత్కాలికంగా మట్టి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం శాశ్వత రహదారి నిర్మించడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. 15 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ మట్టి దారి కొట్టుకుపోయి ద్విచక్ర వాహనం కూడా వెళ్ళలేని స్థితి నెలకొంది. దీంతో శామ్యూల్‌ను ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించలేకపోయామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఆదివాసీ హక్కుల వేదిక అధ్యక్షుడు బోండ్ల వర ప్రసాదరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆగష్టు 9వ తేదిన జరప తలపెట్టిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని రంపచోడవరంలో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతో ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ మహిళలు, యువత, పెద్దలు, ప్రతినిధులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, విజయ్ భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించటానికి కృషి చేయాలని కోరారు.

ఆసుపత్రి నుంచి విద్యార్థి డిశ్చార్జ్

ప్రజాశక్తి-కొయ్యూరు : బ్రెయిన్ సర్జరీ జరిగిన అనంతరం కొయ్యూరు గురుకుల పాఠశాల విద్యార్థి టీ.మోహన్ ప్రేమ్ సందీప్‌ను విశాఖ కెజిహెచ్‌కు నుండి డిశ్చార్జ్ చేసినటుల ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్ మంగళవారం తెలిపారు. గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మోహన్ ప్రేమ్ సందీప్‌కి విశాఖ కేజీహెచ్లో బ్రెయిన్ సర్జరీ జరిగింది. ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక చొరవతో ఆ విద్యార్థికి న్యూరో సర్జరీ చేశారు. చికిత్స అనంతరం కోలుకొన్న విద్యార్థి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు. ఈ విషయమై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాగుల వద్ద హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న వాగుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఐ.పోలవరం వాగు, పాత సీతపల్లి రోడ్‌లో ఉన్న వాగులు, భూపతిపాలెం ప్రాజెక్ట్ వద్ద ఉన్న టూరిస్ట్ స్థలాలు, దేవీపట్నం మండలంలోని గండిపోసమ్మ గుడి వద్దకు, దండంగి గ్రామంలో గోదావరి నది తదితర ప్రాంతాల్లో కాలువలు, వాగులు ఈ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు సిఐ వాసా వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రజలు, యాత్రికులు, టూరిస్టులకు వరదలు తగ్గుముఖం పట్టే వరకు అత్యవసర సమయంలో తప్ప కొండ వాగులు, టూరిస్టు ప్రదేశాల వద్దకు వెళ్ళవద్దని హితవుపలికారు. **కొయ్యూరు :** కొయ్యురు మండలం గాదిగుమ్మి జలపాతం వద్ద కొయ్యురు సిఐ, యస్ఐ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసారు. గతంలో ఈ జలపాతంలో అనేక ప్రమాదాలు జరగడంతో ముందస్తు నివారణ చర్యలో భాగంగా హెచ్చరిక బోర్డు పెట్టినట్టు సీఐ, ఎస్ఐ తెలిపారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మారేడుమిల్లి : చట్టాలపై ఎపి గిరిజన సంక్షేమ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రుద్రరాజు భీమరాజు మాట్లాడుతూ వ్యాపారులు డబ్బు ఆశచూపి అమాయక గిరిజనుల చేత గంజాయి రవాణా చేయిస్తున్నారని, దీంతో గిరిజనులు కేసుల్లో ఇరుక్కుంటున్నారని తెలిపారు. చదువుకునే విద్యార్థులు ఈ విషయాన్ని అర్థం చేసుకుని గ్రామాల్లో తెలియజేయాలని కోరారు. 18సంవత్సరాలు దాటే వరకు బైక్ డ్రైవింగ్ చేయకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, లేకుంటే భారీగా ఫైన్‌లు కట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి ఎస్సై రాము నాయుడు, గుర్తేడు ఎస్సై సాయి కుమార్, పోలీసు సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక ఎపి రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వాసా వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి వల్ల దుష్పరిణామాలు, రోడ్డు భద్రతా నియమాలు, ర్యాగింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎస్ఐ మోహన్ కుమార్, పోలీసు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

బందెల దొడ్డి పాట నిర్వహించాలి

ప్రజాశక్తి - విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వరి వ్యవసాయం మొదలైన నేపథ్యంలో పశువులు వ్యవసాయాన్ని పాడు చేసే అవకాశం ఉందని, అందువల్ల బందెల దొడ్డి పాట నిర్వహించి పశువులను కాపు చేయాలని కోరుతూ పంచాయతీ సర్పంచ్, కార్యదర్శికి గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వేటగాని మల్లయ్య, కన్నం రాజులు మాట్లాడుతూ నారు మడిలో వున్న వరినారును పశువులు పాడు చేస్తున్నాయని తెలిపారు. దీనికి స్పందించిన సర్పంచ్ పూనం సరోజిని మాట్లాడుతూ బందుల దొడ్డి పాట ఈ నెల 31న నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రేఖపల్లి రైతులు సూరిబాబు, కొట్టి బాలకృష్ణ, వేటకాని సత్యనారాయణ, వీర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.